క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



ముత్యాలమ్మ అమ్మవారి ఆలయలంలో కార్తీక శుక్రవార పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీ చక్ర సహిత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో కార్తీక శుక్రవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి, అనంతేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపించినట్టు ఆలయ నిర్మాణ కర్తలు బవిరిశెట్టి మురళీ కృష్ణ, పద్మ కుమారి దంపతులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ ప్రధానార్చకులు కె.విజయ్‌శర్మ పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు.

హామీలు అమలు చేయాలి



మండలంలోని సీతప్పగూడెం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం మండలంలోని సీతప్పగూడెం సచివాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు కారం దారయ్య, బేతి కిశోర్, తెల్లం మునీశ్వరరావు, చోడెం దుర్గ, తదితరులు మాట్లాడుతూ గిరిజన ప్రాంత పేదలకు 3 సెంట్ల స్థలం ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారని అన్నారు. దానిని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

నేడు సత్య సాయిబాబా జయంతి వేడుకలు

కొయ్యలగూడెం: శ్రీ సత్య సాయిబాబా జయంతి వేడుకలకు శ్రీ సత్య సాయినగర్‌లోని బాబా వారి మందిరం ముస్తాబైంది. శనివారం సత్యసాయి 99 వ జయంతి నిర్వహించనున్నారు. తెల్లవారుజామున ఓంకార సుప్రభాత నగర సంకీర్తన, సామూహిక సత్య సాయి వ్రతాలు, గీతా పారాయణం మధ్యాహ్న నుంచి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం నుంచి సత్యసాయి నామ సంకీర్తన, బాల వికాస విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్య సాయి సేవ సమితి పేర్కొంది.

గొర్రెను బతికించిన పశువైద్యులు



కొయ్యలగూడెంలో గొర్రెకు శాస్త్ర చికిత్స చేస్తున్న పశు వైద్య అధికారులు సిబ్బంది

కొయ్యలగూడెం: ప్రాణాపాయ స్థితిలో ఉన్న గొర్రెకు పశు వైద్యాధికారులు శస్త్ర చికిత్స చేసి కాపాడారు. పరింపూడి పశు వైద్యశాల అధికారి బీఆర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కన్నాపురానికి చెందిన బండి వెంకటేష్ గొర్రె కడుపుకు తీవ్ర గాయం కాగా ప్రాణాపాయ స్థితికి చేరింది. వెంకటేష్ గొర్రెను నిడదవోలు పశు వైద్యశాలకు తరలించగా అక్కడ శస్త్ర చికిత్స చేయలేమని వైద్యులు తెలిపారు. దీంతో పరింపూడి పశు వైద్యశాలకు తీసుకురాగా సిజేరియన్ విజయవంతంగా నిర్వహించారు.

ప్రథమ శ్రేణి పంటల పరిశీలన



మండలంలోని కాపవరంలో వేరుశనగ పంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

బుట్టాయగూడెం: మండలంలోని కాపవరం సమీపంలో ఉన్న వేరుశనగ పంటను డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం(వెంకట్రామన్నగూడెం) శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కరుణశ్రీ, డాక్టర్ బి. పెద్దబాబు, డాక్టర్ వి. దీప్తిలు మాట్లాడుతూ వేరుశనగ పంటల్లో పొగాకు లద్దెపురుగు, ఆకుమచ్చ తెగుళ్లు గుర్తించినట్లు చెప్పారు. పొగాకు లద్దెపురుగు నివారణకు నోవాలిరాన్ 200 మిల్లీలీటర్లు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు టేబుకొనజోల్ 200 మిల్లీ లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా చొప్పున చల్లుకోవాలని సూచించారు. బండార్లగూడెం గ్రామంలో కోతకు వచ్చిన మినుము పంటను పరిశీలించారు.

నిరుపయోగంగా మినీ బస్టాండ్



చింతలపూడిలో నిరుపయోగంగా ఉన్న మినీ బస్టాండ్

చింతలపూడి: చింతలపూడిలో మినీ బస్టాండ్ ప్రారంభోత్సవం జరిగి పదేళ్ళు పూర్తయినా ప్రయాణికులకు ఉపయోగపడడం లేదు. దీంతో మినీ బస్టాండ్ ఆటోల పార్కింగ్‌కు, ఆక్రమణదారులకు అడ్డాగా మారింది. పాత బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికులకు కనీసం కూర్చోవడానికి, నిలబడటానికి కూడ స్థలం లేకుండా పోయింది. రోడ్డు పక్కన దుకాణాలు, హోటళ్ళలో బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ముఖ్యంగా బస్టాండ్ లేకపోవడంతో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పాతబస్టాండ్‌లో బస్సులు ఎక్కడానికి బస్సుల వెనకాలే పరిగెట్టి ప్రమాదాలు కొనితెచ్చుకున్న సంఘటనలు లేకపోలేదు. మొహిద్దీన్‌కుంట చెరువు పోరంబోకు స్థలంలో సుమారు రూ.18 లక్షలతో చెరువు అలుగు పారే కాల్వను అభివృద్ధి చేసి మినీ బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టారు. 2010 మే నెలలో ఇక్కడున్న ఆక్రమణదారులను ఖాళీచేయించి మినీ బస్టాండ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ నిధుల్లో రూ.9 లక్షలతో చెరువు కట్టకు కాంక్రీట్ గోడ నిర్మించి డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టారు. మిగిలిన రూ.9 లక్షలకు తోడు కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు సమకూర్చిన నిధులతో మినీ బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. 2013 డిసెంబర్ 17న మినీ బస్టాండ్‌ను కావూరి ప్రారంభించారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్ర శాలలు నిర్మించి బస్సులు బస్టాండ్‌కు వచ్చి వెళ్ళేలా చర్యలుతీసుకోక పోవడంతో ప్రయాణికులకు ఉపయోగం లేకుండా పోయింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా మరోసారి మినీ బస్టాండ్‌ను శుభ్రపరిచి కాంక్రీట్ చప్టా నిర్మించారు. త్వరలోనే టాయిలెట్లు నిర్మించి మినీ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు ప్రకటించారు తప్ప పట్టించుకోలేదు. తక్షణం మినీ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే



అధికారుల నిర్లక్ష్యం వల్లే లక్షలాది రూపాయలతో నిర్మించిన మినీ బస్టాండ్ నిరుపయోగంగా పడి ఉంది. మిగిలిన పనులు కూడ పూర్తి చేసి మినీ బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకు రావాలి.పాత బస్టాండ్ సెంటర్‌లో నిలువ నీడ లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

ఎండీ ఇబ్రహీం దౌల(జిలాని), చింతలపూడి

మరుగుదొడ్లు నిర్మించాలి



మినీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మూత్ర శాలలు, మరుగుదొడ్లు నిర్మించాలి. బస్సుల రాకపోకలకు అనువుగా బస్టాండ్ ఆవరణను అభివృద్ధి చేసి అధికారులు తక్షణం బస్టాండ్‌ను ప్రారంభించాలి.

తొర్లపాటి బాబు, పాత చింతలపూడి

మహా ధర్నాను విజయవంతం చేయాలి



మహాధర్నాను జయప్రదం చేయాలంటూ ప్రదర్శన

పోలవరం రూరల్: రైతు– కూలీల, శ్రామికుల సమస్యలు పరిష్కరించాలని సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత కార్మిక సంఘాల సమన్వయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా నవంబర్ 26న ఏలూరులోని కలెక్టర్ ఆఫీస్ వద్ద మహాధర్నాను విజయవంతం చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం (ఆంధ్ర) ఆధ్వర్యంలో పోలవరం మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రగడపల్లి, రేపల్లె వాడ వెంకటరెడ్డి గూడెం, గుంజవరం రామన్నపాలెం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పోలవరం ఏటిగట్టు సెంటర్ వద్ద ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు కూలీ సంఘం (ఆంధ్ర) జిల్లా కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను తొలగించి కార్పొరేట్ శక్తులకు, సామ్రాజ్యవాదులకు మేలు చేకూర్చే లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, మిడియం రవి దొర, మడకం పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి 108 సిబ్బంది సమ్మె



కొయ్యలగూడెం మండలం పరింపూడిలో 108 వాహనం వద్ద నినాదాలు చేస్తున్న సిబ్బంది

కొయ్యలగూడెం: 108 సర్వీసులను, సిబ్బందిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నందుకు నిరసనగా ఈనెల 25 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు 108 సిబ్బంది పేర్కొన్నారు. 108 నిర్వహణ పట్ల ప్రభుత్వ విధానాలకను వ్యతిరేకంగా నిరసిస్తూ పరింపూడిలోని 108 వాహనం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాల పెంపు, 12 గంటల పని విధానాన్ని రద్దుచేసి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాల చెల్లింపు, మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా, వేతనంతో సంబంధం లేకుండా నాలుగువేల రూపాయల గౌరవ వేతనాన్ని కల్పించాలని, తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న విధంగా ఉద్యోగ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలని, 108 వాహనాలకు శాశ్వత షెడ్లు సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కోడి పందేలపై దాడి

కుక్కునూరు: కోడిపందేల స్థావరంపై కుక్కునూరు పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు గ్రామమైన సీతానగరంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కోళ్లు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ నాగేశ్వరరావు తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కామవరపుకోట: స్థానిక షేర్ అండ్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో 15 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు తమ్మిశెట్టి రత్నగిరి మాట్లాడుతూ సంస్థ ద్వారా కోవిడ్ సమయం నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టామని అందులో భాగంగా కామవరపుకోట మండల వ్యాప్తంగా కూడా పలు సహాయ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): త్వరలో జరిగే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.రాంబాబు, నాదెండ్ల బాబ్జి ఒక ప్రకటనలో తెలిపారు. పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకుల గొంతును చట్టసభలో వాడిగా వినిపించగలరని విశ్వసిస్తున్నామని పేర్కొన్నారు.

కంప్యూటర్‌పై ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువతకు కంప్యూటర్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు యువతకు కంప్యూటర్ ట్యాలీ, ఎంఎస్ ఆఫీస్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 10వ తరగతి ఆపైన విద్యార్హతలు గల 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల వారికి ఈ నెల 25 నుంచి శిక్షణ ప్రారంభిస్తామని వివరించారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు సంస్థ అందిస్తుందని, ఆసక్తి గల వారు ఫోన్ నెంబర్లు 95027 23561, 90140 40780, 95330 79471లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



శిక్షణ పొందుతున్న మహిళలకు టూల్ కిట్స్ అందచేసిన దృశ్యం

చింతలపూడి: హస్త కళా నైపుణ్యంలో గ్రామీణ ప్రాంత మహిళలు రాణించాలని అజీమ్ చారిటీ ఫౌండర్ షేక్ అజాద్ బాబు అన్నారు. హస్త కళలు, కేంద్ర జౌళీ మంత్రిత్వ శాఖ ఆర్థిక సహకారంతో, ఏపీఐటీసీఓ నిర్వహణలో హ్యాండ్ ఎంబ్రాయిడరీకి సంబంధించిన కార్యక్రమంలో శిక్షణ తీసుకుంటున్న హస్త కళాకారులకు శుక్రవారం టూల్ కిట్స్ అందచేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అజాద్ మాట్లాడుతూ ప్రస్తుతం హస్త కళలకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ముప్పై మందికి టూల్ కిట్స్ అందించారు.

శ్రీవారి ట్రస్టుకు రూ.1.11 లక్షల విరాళం



విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ అధికారి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ.1,11,116 విరాళంగా అందజేశారు. తణుకుకు చెందిన ముళ్లపూడి మణికంఠ, సుష్మ దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాత దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మహాలనోబిస్ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రముఖ గణాంకవేత్త ఆచార్య ప్రశాంత చంద్ర మహాలనోబిస్ అంతర్జాతీయ పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేఎస్ ప్రభాకర రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ స్టేస్టిక్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మహాలనోబిస్ జ్ఞాపకార్థం అంతర్జాతీయ పురస్కారాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఏటా గణాంక పద్ధతుల్లో గణనీయమైన కృషి చేసిన, అభివృద్ధి చెందుతున్న దేశానికి చెందిన గణాంక నిపుణుడికి ఈ అవార్డును ఇస్తున్నట్టు వివరించారు. ఈ అవార్డును నెదర్లాండ్‌లోని ఇంటర్నేషనల్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ నిర్వహిస్తోందని, పురస్కారానికి ఎంపికైన వ్యక్తికి 10 వేల అమెరికన్ డాలర్ల నగదుతో పాటు ప్రశంసా పత్రం అందిస్తారని తెలిపారు.

యాంటీబయోటిక్స్ వాడకం అనర్థదాయకం

గణపవరం: ఆక్వాసాగులో విచ్చలవిడిగా యాంటీబయోటిక్స్ వాడకం అనర్థదాయకమేకాక రైతులకు ఆర్థికంగా నష్టం కలుగుతుందని మత్స్యశాఖ నిపుణులు ఎ.ఆనందకుమార్, ఎస్ దుర్గారావు అన్నారు. శుక్రవారం గణపవరంలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ ఉపప్రాంతీయ విభాగం, గణపవరం మత్స్యశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన ఆక్వారైతుల శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో వారు పాల్గొన్నారు. రైతులు మత్స్యశాఖ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకుని సాగులో మెళకువలు పాటించడం ద్వారా సాగును లాభదాయకంగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న రైతులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మండల ఎఫ్‌డీఓ శివరామకృష్ణ రెతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉండాలి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

కామవరపుకోట: పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు. శుక్రవారం ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే సౌకర్యాలు సరిగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాలు శుభ్రంగా లేని కారణంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి, ఇతర కారణాలతో మరో ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసులిచ్చారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో ఏ పాఠశాలలోనైనా విద్యార్థుల నోటుబుక్స్, వర్క్ బుక్స్ దుద్దకపోయినా, పరిసరాల శుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



చింతలపూడి మండలం కంచనగూడెంలో ఎక్సైజ్ అధికారుల దాడుల్లో పట్టుబడ్డ బెల్లపు ఊట

చింతలపూడి: చింతలపూడి మండలంలోని రేచర్ల, ప్రగడవరం, శివపురం గ్రామాల్లో స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. రేచర్ల గ్రామంలో కంచర్ల మహాలక్ష్మి నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రగడవరంలో దాడులు నిర్వహించగా బాలం ఏడుకొండలను అరెస్ట్ చేసి అతని నుంచి 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. నాగిరెడ్డిగూడెం గ్రామంలో 1100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. శివపురం గ్రామానికి చెందిన నాయుడు రాంబాబును లింగపాలెం తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

పోలవరం రూరల్: అర్హులై ఉండి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందని వారి వివరాలను జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ పరిశీలించారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా పోలవరం రెవెన్యూ కార్యాలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. పలువురికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందలేదని, అలాగే భూమికి భూమి చెల్లించాల్సి ఉందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులను పరిశీలించారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

టి.నరసాపురం: జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేసి హిందువులు ఐక్యత చాటుకోవాలని సమరసత సేవ ఫౌండేషన్ ఏలూరు జిల్లా కన్వీనర్ తిప్పాపట్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక శివాలయం కల్యాణ మండపంలో జరిగిన హైందవ శంఖారావ సభలో ఆయన మాట్లాడారు. ధర్మాదాయ శాఖను రద్దుచేసి ఆలయాలను ఆలయ నిర్వహణను ధార్మిక సంస్థలకు అప్పగించాలని కోరారు. హిందువుల సొమ్మును హిందువుల గుడులకే కేటాయించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న అనేక రామాలయాలకు శివాలయాలకు హిందువుల సొమ్ముతో బాగు చేయించాలన్నారు. జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావ సభకు ప్రతి గ్రామం నుంచి హిందువులు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ భూపతి, శేషు, మరీదు వెంకట నాగేశ్వరరావు, మురళీకృష్ణ విశ్వహిందూ పరిషత్ ప్రచారక్ సూర్యారావు, రాటాలు, కాగితాలు, రాంబాబు, నాగార్జున, పలువురు హిందూ ప్రజలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజలకు శాపం

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వం ప్రజలకు శాపాన్ని మిగిల్చింది అని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయు మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు పేర్కొన్నారు. శుక్రవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయకపోతే వినియోగదారులంతా ఐక్యమై ప్రభుత్వంపై పోరాడేలా చేస్తామన్నారు. విద్యుత్ చార్జీల్లో పెంపుదల ప్రతిపాదనల వల్ల వినియోగదారులపై రూ.11,820 కోట్ల భారం పడనుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అనవసరపు అదనపు ఖర్చులు ప్రజలపై వేసి విద్యుత్ చార్జీలు పెంచితే చూస్తూ ఊరుకోమన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో 2000లో ఆందోళన చేస్తే నలుగురిని చంద్రబాబు ప్రభుత్వం బలితీసుకుందన్నారు. ప్రజలంతా ఐక్యమై చంద్రబాబును 2004 ఎన్నికల్లో ఇంటికి సాగనంపారన్నారు.

నూకాలమ్మకు విశేష పూజలు



నూకాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ అమ్మవారు శుక్రవారం విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కల్యాణ కళా వేదిక వద్ద ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీ జలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. మూల విరాట్‌కు ఏకాదశ హారతి పూజలు, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి , నీరాజన మహామంత్ర పుష్పం, సాయం సంధ్యా హారతి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మ వారికి సుమారు ఇరవై అయిదు కేజీల వెండితో చీర తయారు చేసే కార్యక్రమం భక్తుల సహకారంతో చేస్తున్నామన్నారు.

జెట్టి గురునాథరావుకు అభినందనలు

టి.నరసాపురం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జెట్టి గురునాథరావుకు పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కురసం నిరీక్షణరావు, యూత్ నాయకులు అభినందనలు తెలిపారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలో ఆయన స్వగృహంలో కలిసిన వారు పూలబొకే ఇచ్చి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ అంశాలపై ఆయనతో చర్చించారు. మెట్ట ప్రాంతానికి చెందిన జెట్టికి రాష్ట్ర పదవి కేటాయించడం హర్షణీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అభినందనలు తెలిపిన వారిలో యూత్ నాయకులు పూసం సూర్యచంద్రరావు, కూరం ప్రసాద్, కోర్సా రామకృష్ణ, మానుకొండ నాని తదితరులు పాల్గొన్నారు.

మందులపై జీఎస్టీ ఎత్తివేయాలి

ఏలూరు (టూటౌన్): అత్యవసర మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని, కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, మెడికల్ సేల్స్ అండ్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ యూనియన్ నాయకులు శుక్రవారం డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు ద్వారా జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం సాయంత్రం ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటిటీ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు మద్దతుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వినతి పత్రం అందజేశారు. ఢిల్లీలో ధర్నాకు మద్దతుగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు వ్యక్తం చేశామని యూనియన్ అధ్యక్షులు బీవీ సత్యనారాయణ తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తోందని విమర్శించారు కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు పి.కిషోర్, మెడికల్ రిప్రజెంటిటీస్ యూనియన్ నాయకులు ఉమా మహేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పని సర్దుబాటు తరచూ వద్దు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తరచూ పని సర్దుబాటు చేయడంతో ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఆందోళనకు, గందరగోళానికి గురవుతున్నారని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగులోతు కృష్ణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రత్నం బాబు, జి.మోహన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాత్కాలిక పని సర్దుబాటుకు విరామం పలికి, అవసరమైన చోట విద్యా వలంటీర్లతో భర్తీ చేయాలని గతంలో మాదిరి నెలవారి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన స్థానంలో పదోన్నతులు ఇవ్వడం ద్వారా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత నివారించవచ్చని సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలంటూ పైలెట్ ప్రాజెక్టును తీసుకురావడం శోచనీయమని తెలిపారు. పీఎం శ్రీ యాప్ అనుసంధానంతో పాఠశాల గ్రాంట్లు జమ చేయడంలో ఉన్న షరతులను ఎత్తివేసి పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో నేరుగా జమయ్యేటట్లు చూడాలని కోరారు.